ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 18.0

సర్కార్ ఉక్కుపాదం..!

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడు వారాలుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులపై ఉక్కుపాదం మోపేందుకు వైసీపీ సర్కార్ సిద్ధమైంది. ఈ రోజు సాయంత్రం లోగా సమ్మె విరమించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీనిపై అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం మాని, వాటిని ప్రశ్నించినందుకు చర్యలకు దిగుతారా? అంటూ మండిపడుతున్నారు.


కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన


కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష ఉద్యోగుల ధర్నా

- నేటిలోగా అంగన్‌వాడీలు సమ్మె విరమించాలని అల్టిమేటం
- లేదంటే ప్రత్యామ్నాయం చూసుకుంటామంటూ కలెక్టర్ హెచ్చరిక
- మండిపడుతున్న అంగన్‌వాడీలు
- మరోవైపు సమగ్రశిక్ష ఉద్యోగులకు నేడు నోటీసుల జారీ
- సిబ్బందిపై ఒత్తిడి తెచ్చేలా 'తీవ్ర చర్యలు' తీసుకుంటామంటూ హెచ్చరికలు
- నేడు విజయవాడలో ఎస్ఎస్ఏ ఎస్పీడీ కార్యాలయ ముట్టడి

ఏలూరు కలెక్టరేట్, జనవరి 4 : అంగన్‌వాడీలు ఈ నెల ఐదో తేదీలోగా సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని కలెక్టర్ల ద్వారా ఆదేశాలు జారీ చేయించింది. జిల్లాలో అంగన్‌వాడీలు, ఆయాలు, మినీ వర్కర్లు కలిపి మొత్తం 2,300 మంది ఉన్నారు. 2,150 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. గత ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు గత నెల 12 నుంచి చేస్తున్న సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరింది. ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకుని తెరిపించింది. ఇది మూన్నాళ్ల ముచ్చటగా మారడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో కేంద్రాలను నిర్వహించాలని ప్రయత్నించి మరోమారు విఫలమైంది. తాజాగా కలెక్టర్ ద్వారా అంగన్‌వాడీలకు అల్టిమేటం జారీ చేసింది. ప్రభుత్వం చాలా చేసిందని, మిగిలినవి చేస్తుందని అంగన్‌వాడీ కేంద్రాల మూతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారమందక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా ఆహారభద్రత చట్టం అమలుకు విఘాతం కలుగుతున్నందున ఈ నెల 5వ తేదీలోగా కచ్చితంగా విధుల్లో చేరాలని, లేదంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని పేర్కొన్నారు. అంటే అంగన్‌వాడీలను పక్కనపెట్టి ఇతరులతో ఆయా పనులు చేయించుకుని కేంద్రాలు నిర్వహిస్తామని చెప్పకనే చెప్పినట్టు అయింది. సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులు, దౌర్జన్యాలతో తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం యత్నించడం సరికాదని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. కాగా కలెక్టరేట్ వద్ద గురువారం సమ్మెలో భాగంగా నిరసన తెలిపారు. రజని, కుమారి, రాజకుమారి, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ విధులకు హాజరు కాకుంటే అంగన్‌వాడీలను టెర్మినేట్ చేస్తాంటున్న వైసీపీ ప్రభుత్వాన్ని రెండు నెలలు ఆగితే రాష్ట్ర ప్రజలే టెర్మినేట్ చేస్తారన్నారు.

రేపటిలోగా విధుల్లోకి చేరకపోయారో..

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4 : సమాన పనికి సమాన వేతనం, సర్వీసుల రెగ్యులరైజేషన్, హెచ్‌ఆర్ పాలసీ తదితర డిమాండ్లతో గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల ఆందోళనను అణచివేసే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు ఎస్ఎస్ఏ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ/ఎస్ఎస్ఏ తీవ్ర చర్యలకు సిద్ధమైంది. సమ్మెలో పాల్గొన్న వారందరికీ హెచ్చరికలు జారీచేస్తూ శుక్రవారం సాయంత్రం నోటీసులు జారీ చేయనున్నట్టు జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష అధికారులు వెల్లడించారు. ఆ ప్రకారం శనివారం ఉదయం లోగా సమ్మె చేస్తున్న సిబ్బంది విధుల్లో చేరాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, తదుపరి తీవ్ర చర్యలుగా ఉద్యోగ విధుల నుంచి తొలగించి ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించుకుంటామనే హెచ్చరిక ఒకటని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎస్ఎస్ఏ ఏలూరు ప్రాజెక్టు పరిధిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు 15 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 28, మండలస్థాయి అకౌంటెంట్లు 13, మెసెంజర్లు 25, సీఆర్పీలు 121, ఐఈఆర్పీలు 46, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 161, ఆఫీస్ సబార్డినేట్లు కలిపి మొత్తం 433 మంది పనిచేస్తు న్నారు. నిరవధిక సమ్మెలోకి వీరితోపాటు కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిలో కొందరు వెళ్లిన ప్రభుత్వ హెచ్చరికలతో వీరంతా బుధవారం ఉద్యోగ విధుల్లోకి వచ్చేసినట్టు జిల్లా విద్యాశాఖ వర్గాలు వెల్లడించా యి. సిబ్బంది సమ్మె కారణంగా విద్యాశాఖలో నాడు-నేడు పనులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పర్యవేక్షించే పనులు తదితర కార్యకలాపాలు నిలిచిపోయాయి. జిల్లాలో ఈ పనుల్లో కొన్నింటిని వర్కింగ్ టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగించడం ద్వారా ప్రత్యామ్నాయ మార్గాల్లో నెట్టుకొస్తున్నారు.

అదరం.. బెదరం

ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా అదిరేది.. బెదిరేది లేదు. ఉద్యోగం తీసేస్తామని హెచ్చరిస్తున్నా సమ్మె ఆపేది లేదు. కలెక్టర్ ఇచ్చిన డెడ్‌లైన్‌ను పట్టించుకోం. అందరూ సమ్మెలోనే పాల్గొంటాం. విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదు.

\- హైమావతి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు

నేడు విజయవాడలో ఎస్పీడీ కార్యాలయం ముట్టడి

సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రాజెక్టు డైరెక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు విజయవాడ పడమట రైతుబజార్ సమీపంలోని ఎస్ఎస్ఏ ఎస్పీడీ కార్యాలయ ముట్టడికి ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగులను నిందించేలా ఎస్పీడీ మాట్లాడటం గర్హనీయమని సమగ్రశిక్ష పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు విమర్శించారు. మహిళా ఉద్యోగులను అవమానపరుస్తూ వ్యాఖ్యానించిన ఎస్పీడీ ఆ పదవికి అనర్హుడని ఉద్యోగుల సమ్మెకు మద్దతు పలికిన సీపీఐ(మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీడీపై తక్షణమే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ టీచర్లకు పాతపెన్షన్ విధానమే వర్తింపు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4 : పాత పెన్షన్ (ఓపీఎస్) కోసం పోరుబాట పట్టిన వారిలో కొందరికి తీపికబురు ఇది. ఓపీఎస్‌ను 2004 సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు సంబంధిత నిర్దేశిత తేదీ తర్వాత ఉద్యోగ నియామకాలు పొందిన వారికి కంట్రిబ్యూటరీ పెన్షన్(సీపీఎస్) విధానాన్ని అమలు చేయాల్సి ఉండగా, పలు రాష్ట్రాల్లో కటాఫ్ తేదీకి ముందు జరిగిన నియామకాలకూ సీపీఎస్‌ను వర్తింపజేస్తున్న విషయాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు. దీనిపై చాలా ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. తాజాగా ఓపీఎస్‌పై ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. ఆ ప్రకారం డీఎస్సీ-2003లో నోటిఫికేషన్ వెలువడి, నియామకాల ప్రక్రియ పూర్తయి 2004 సెప్టెంబరు తర్వాత ఉద్యోగ విధుల్లో చేరినప్పటికీ ఆ ఉపాధ్యాయులందరికీ ఓపీఎస్‌ను వర్తింపజేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి రామారావు తెలిపారు. ఈ ఉత్తర్వుల వల్ల ఏలూరు జిల్లాలో మొత్తం 436 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో పనిచేస్తున్న టీచర్లందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుందన్నారు. వీరితోపాటు కోర్టు కేసుల కారణంగా నియామకాలను 2007లో పొందిన మరో 15మంది హిందీ పండిట్లకు ఓపీఎస్‌నే వర్తింపజేయాల్సి ఉంటుందన్నారు.

వనామికి మంచు గండం

- ఆక్సిజన్ అందక చనిపోతున్న రొయ్యలు
- హడావుడిగా పట్టుబడులు
- అయినకాడికి అమ్మకాలు
- పెట్టుబడులు రాక నష్టాలు.. రైతుల లబోదిబో

కలిదిండి, జనవరి 4 : మంచు ప్రభావంతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. జనవరిలో రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రొయ్యల సాగు విస్తృతంగా చేస్తున్నారు. ఉదయం వేళ భారీగా మంచు కురుస్తూ చెరువులో తెట్టుగా పేరుకుపోవడంతో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపంతో రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో చిన్న సైజు రొయ్యలనే హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. కౌంటుకు రాకుండానే పట్టుబడి చేయడంతో గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. కనీసం ఖర్చులు రాక అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన రొయ్యలు రంగు మారడంతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో వాటిని గోతుల్లో వేసి పూడుస్తున్నారు. కొద్ది రోజులుగా ఉదయాన్నే మంచు దట్టంగా పడుతుండడంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు చనిపోతున్నాయి. ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతున్నా ఫలితం లేదు' అని రైతు అంద్రాజు శ్రీనివాస్ వాపోయారు. మార్కెట్‌లో నాసి రకం మందులను విక్రయిస్తున్నారు. వీటిని చెరువుల్లో చల్లుతున్నప్పటికీ ప్రయోజనం ఉండడం లేదని ఎస్.చలపతిరావు ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో చల్లాలి. తెల్లవారుజాము నుంచి ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలి. దీనివల్ల ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. మేత తక్కువగా వేయాలి' అని మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా రైతులకు సూచించారు.


రంగు మారిన రొయ్యలు

రొయ్యల చెరువుపై కురుస్తున్న మంచు


తపనా చౌదరి కంటికి స్ట్రోక్



ఏలూరు టూ టౌన్, జనవరి 4 : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపన చౌదరి) అస్వస్థతకు గురైనట్టు బీజేపీ నేతలు తెలిపారు. మెదడు నుంచి కంటికి వెళ్లే నాళంలో బ్లాక్ (గడ్డ) ఏర్పడడంతో కుడి కంటికి స్ట్రోక్ వచ్చింది. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నుంచి అక్కడే వున్న కిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. పదిహేనేళ్లుగా సేవా రంగంలో ఉండడంతో ప్రజల ఆశీస్సులతో క్షేమంగానే ఉన్నానని, ఈ నెల 10వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటానని చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో చాట్రాయి తహసీల్దార్ మృతి 7

కెనరా బ్యాంక్ Canara Bank | చింతలపూడి బ్రాంచ్ (6310) డి.నెం. 101-102, గ్రౌండ్ ఫ్లోర్, మెయిన్ రోడ్డు, చింతలపూడి. ✆ 8333813823

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత(లు): మెస్సర్స్ ఛాయ ట్రేడర్స్, హెచ్.నెం. 18 1P, పోతునూరు, చింతలపూడి, ఏలూరు-534460 వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ. 1,05,52,164.65/- (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల యాభై రెండు వేల నూట అరవై నాలుగు రూపాయలు మరియు అరవై ఐదు పైసలు) మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది 13-10-2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని 03.01.2024 వ తేదీన స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీత, హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్ వారికి చెల్లించవలసిన బకాయి రూ. 1,05,52,164.65/- (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల యాభై రెండు వేల నూట అరవై నాలుగు రూపాయలు మరియు అరవై ఐదు పైసలు) + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు

ఏలూరు జిల్లా, చింతలపూడి ఎస్ఆర్ఓ, చింతలపూడి మండలం, పోతునూరు గ్రామ పంచాయితీ, పోతునూరు గ్రామం, అసెస్‌మెంట్ నెం. 235, డి.నెం. 2-35, ఆర్.ఎస్. నెం. 18/1O లోని ఎ. 0-02 సెంట్లు, ఆర్.ఎస్. నెం. 18/1P లోని ఎ. 1-12.26 సెంట్లు, ఆర్.ఎస్. నెం. 18/1J లోని ఎ. 0-06 సెంట్లు, ఆర్.ఎస్. నెం. 97/1 లోని ఎ. 0-40 సెంట్లు, కలిపి మొత్తం ఒకే ప్లాట్‌గా ఎ. 1-60.26 సెంట్లు లేదా 7756.62 చ॥గ॥ మెస్సర్స్ ఛాయ ట్రేడర్స్, శ్రీమతి సీలం ఛాయాదేవి, భర్త శీలం శ్రీనివాసరావు పేరునగల ఎసి షీట్ రూఫ్డ్ రైస్ మిల్. హద్దులు: తూర్పు: చింతలపూడి నుండి సత్తుపల్లి లింక్ రోడ్డు, దక్షిణం: చింతలపూడి నుండి సత్తుపల్లి రోడ్డు, పడమర: ఏలుగు పుల్లయ్య & ఇతరులు భూములు, ఉత్తరం: పుప్పల బ్రహ్మారావు భూమి.

తేది: 03-01-2024
ప్రదేశం: చింతలపూడి
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
జంగారెడ్డిగూడెం బ్రాంచ్
అశ్వరావుపేట రోడ్, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా, ఫోన్ నెం.08821-227399

సెక్షన్ 13(2)క్రింద డిమాండ్ నోటీసు

దిగువ వారికి,
1. ఋణగ్రహీతలు : 1) శ్రీ దాసరి రామారావు, తండ్రి : దాసరి పుల్లయ్య, డి.నెం.2-160, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రక్కన, పూచికపాడు, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా, ఆం.ప్ర-534456.
2. శ్రీమతి దాసరి వరలక్ష్మి, భర్త : దాసరి రామారావు, డి.నెం.2-160, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రక్కన, పూచికపాడు, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా, ఆం.ప్ర-534456.
హామీదారు : 3. శ్రీ దాసరి శేషు కుమార, తండ్రి : దాసరి పుల్లయ్య, డి.నెం.6-2-129/13, ఫ్లాట్ నెం.201, పవన్ తేజ అపార్ట్‌మెంట్, సూర్య కాలేజ్ రోడ్ దగ్గర, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా-534447.
అయ్యా / అమ్మా,

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, సెక్షన్ 13 (2) క్రింద నోటీసు తేది **20.11.2023** న అధీకృత అధికారి, **జంగారెడ్డిగూడెం బ్రాంచ్** వారి నుండి మీరు చివరిగా తెలిపిన చిరునామాలో మీ ఋణ ఖాతాలోని బకాయిలను తిరిగి చెల్లించమని పిలుపునిచ్చే డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. కానీ బట్వాడా చేయబడకుండా తిరిగి మాకు చేరింది. అందువల్ల, ఈ డిమాండ్ నోటీసులోని విషయాలు ఈ వార్తాపత్రికలో ప్రచురించబడుతున్నాయి.

11.11.2023 న మీరు పొందిన ఋణ సౌకర్యాలు /అప్పులను మొండి బకాయిగా (ఎన్‌పిఏ) వర్గీకరించడమైంది.

ఋణము పొందినపుడు బ్యాంకునకు మీరు భద్రతా ప్రమాణాలుగా ఋణ పత్రాలను ఒడంబడిక చేసారు. ఇందులోని ఋణ సౌకర్యాల నిమిత్తం సురక్షిత ఆస్తుల వివరాలు క్రింది విధం గా ఉన్నాయి.

20.11.2023 నాటికి బకాయి హోమ్ లోన్ నందు ఉన్న మొత్తంతో క్రెడిట్ సౌకర్యాలు పొందబడ్డాయి, మొత్తం బకాయి **రూ.8,30,605.35 పై (అక్షరాలా ఎనిమిది లక్షల ముప్పై వేల ఆరు వందల ఐదు రూపాయల ముప్పై ఐదు పైసలు మాత్రమే)**

సెక్యూర్డు ఆస్తి వివరములు : జంగారెడ్డిగూడెం, సమీప డి.నెం.17-3-123, ఫ్లాట్ నెం.183, ఆర్ ఎస్ నెం.92 లో 200 చ॥గ॥ల విస్తీర్ణం గల భూమి మరియు భవనం యావత్తు ఆస్తి **శ్రీ దాసరి రామారావు** గారి పేరున ఉన్నది.

అస్తి హద్దులు : తూర్పు : 36 అ॥ల 8 గజాల వెడల్పు రోడ్, **దక్షిణం** : ఫ్లాట్ నెం.182 కు చెందిన 50 అ॥ల స్థలం, **పడమర:** ఫ్లాట్ నెం.186 కు చెందిన 36 అ॥ల స్థలం, **ఉత్తరం** : ఫ్లాట్ నెం.184 కు చెందిన 50 అ॥ల స్థలం,

కాబట్టి, నెం.1, 2 ఋణగ్రహీతలు మరియు నెం.3, హామీదారు అయిన మీరు పైన పేర్కొన్న **రూ.8,30,605.35 పై (అక్షరాలా ఎనిమిది లక్షల ముప్పై వేల ఆరు వందల ఐదు రూపాయల ముప్పై ఐదు పైసలు మాత్రమే)** మొత్తాన్ని భవిష్యత్తు వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించవలసిందిగా నోటీసు ద్వారా పిలుపునిచ్చాము. చెల్లింపు లో మీరు విఫలమైతే సురక్షితమైన ఋణదాత అయిన మేము, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002, సెక్షన్ 13 (13), ప్రకారం దానిని పాటించడంలో, సెక్షన్ 13(4)లోని కింద హక్కులను వినియోగించుకోవడానికి అర్హులము. ఈ చట్టం ప్రకారం మీరు బ్యాంక్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా నోటీసు అందిన తేదీ నుండి పైన పేర్కొన్న ఈ భద్రపరచబడిన ఆస్తులను బదిలీ చేయకూడదు. సురక్షితమైన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను దయచేసి చదువుకొనగలరు.

తేది : 04.01.2024
ప్రదేశం : జంగారెడ్డిగూడెం
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



మంగళగిరి తెలుగుదేశం కార్యాలయంలో గురువారం జరిగిన జయహో బీసీ వర్క్‌షాపులో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, పాల్గొన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పితాని సత్యనారాయణ, గొర్రెల శ్రీధర్ తదితరులు, చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

నీతికి-అవినీతికి యుద్ధం

ఇలాంటి శాడిస్టు సీఎంను ఎప్పుడూ చూడలేదు : రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

ఆచంట/పాలకొల్లు టౌన్/భీమవరం టౌన్: జనవరి 4 : రాబోయే ఎన్నికలు నీతికి, అవినీతికి మధ్య యుద్ధం వంటిదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే, ఆచంట సభ టూర్ కో-ఆర్డినేటర్ గోరంట్ల బుచ్చియ్యచౌదరి స్పష్టం చేశారు. ఈ నెల ఏడో తేదీన ఆచంటలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు భారీ బహిరంగ సభ పర్యవేక్షణ నిమిత్తం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రజాస్వామ్యంలో అందరికి హక్కులు ఉంటాయి. ఈ ప్రభుత్వంలో మీడియాపై నియంత్రణ, రాజకీయ పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. జగన్ దోచుకున్న లక్షల కోట్ల తో మీడియా నడుపుతున్నారు. తన 55 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి శాడిస్ట్ సీఎంను ఎప్పుడూ చూడలేదు' అని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల టీడీపీ అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ జగన్ పాలనలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ఆచంట సభలో చంద్రబాబు రైతులకు దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. రెండు జిల్లా కో-ఆర్డినేటర్లు మందలపర్రు రవి, గొడవర్తి శ్రీరాములు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య పాల్గొన్నారు.




ఆచంటలో మాట్లాడుతున్న రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చియ్యచౌదరి, భీమవరంలో మాట్లాడుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తోట సీతారామలక్ష్మి

చంద్రబాబు సభకు తరలిరండి



ఆచంటలో టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేద్దామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ పిలుపునిచ్చారు. పాలకొల్లులోని ఎమ్మెల్యే రామానాయుడు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ స్థాయిలో జరిగే 'రా కదలిరా టీడీపీ ఎన్నికల శంఖారావ మహాసభకు పాలకొల్లు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్య లో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్తారన్నారు. మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే ఎమ్మెల్యే నిమ్మలను గత మెజార్టీకన్నా రెండింతల ఎక్కువతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

జగన్ ప్రభుత్వం అన్నింటా విఫలం

'సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నిరంగాల్లో పూర్తిగా విఫలమైంది. స్థానిక అధికారులను బదిలీ చేసినట్టు వైసీపీ ఎమ్మెల్యేలను, ఇన్‌చార్జిలను బదిలీ చేసే పరిస్థితికి దిగజారింది. సీఎం తన కుటుంబంలో చిచ్చు పెట్టుకున్నాడు. జగనన్న బాణం షర్మిల తిరిగి ఆయనపైనే ఎక్కు పెట్టింది. మరో మూడు నెలల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం.' అని అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం భీమవరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి కలిసి మాట్లాడారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ రానున్న ఎన్నికల ప్రజాక్షేత్రంలో జగన్ ఓడిపోతామని తెలిసి వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల్లో అసమ్మతి వ్యతిరేకత ఉందనే సాకుతో అభ్యర్థులను, ఇన్‌చార్జిలను మారుస్తున్నారని ఎంతమంది అభ్యర్థులను మార్చిన జనం జగన్‌ని మార్చడం ఖాయమన్నారు. చంద్రబాబు సభను విజయవంతం చేయాలని కోరారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్‌తో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్‌పై త్వరలోనే వైసీపీ ఎమ్మెల్యేలు ఎంపీలు తిరుగుబాటు చేసి పార్టీని విడవనున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాలు, పట్టణం నుంచి చంద్రబాబు మహాసభకు అత్యధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహాసభ భీమవరం, వీరవాసరం మండల పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, శీలం వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, భీమవరం పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలంలో నరసాపురం డీఎస్పీ పరిశీలన

ఆచంటలో నిర్వహించే చంద్రబాబు బహిరంగ సభ నిమిత్తం సభా స్థలం ఏర్పాట్లపై గురువారం నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరచారి టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు ఎలా చేస్తున్నారనే దానిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గన్ని వీరాంజనేయులు, తోట సీతారామలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. వీరు హెలిప్యాడ్ ప్రాంతాన్ని, ప్యార్కింగ్ ప్రాంతాన్ని సభా స్థలాన్ని చూపించి ఏర్పాట్లపై వివరించారు. కార్యక్రమంలో పెనుగొండ సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఉన్నారు.

వైసీపీలో చేరింది జన సైనికులు కాదు'



భీమవరం టౌన్ : 'ఇటీవల భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన నుంచి వైసీపీలో చేరిన వారు స్థానిక జనసైనికులు కాదు.. ఇతర జిల్లాల వారని, దీనిపై బహిరంగ చర్చకు వస్తే సిద్ధమని జనసేన జిల్లా కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ సవాల్ విసిరారు. భీమవరంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. భీమవరం నుంచి పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని బలంగా నమ్ముతామని, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలియడం లేదన్నారు. బండి రమేష్‌కుమార్, మోకా శ్రీను, మాగపు ప్రసాద్, ఎల్.నాగు పాల్గొన్నారు

కరాటం జానకీరామ్‌కు టీడీపీ తీర్థం

బుట్టాయగూడెం : వైసీపీ నాయకుడు కరాటం జానకీరామ్ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జానకీరామ్ సతీమణి సీతాదేవి పోలవరం మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు కృష్ణస్వరూప్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు. నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సూచనల మేరకు టీడీపీలో చేరారు. నాయకులు యంత్రప్రగడ శ్రీనివాసరావు, గడ్డె అబ్బులు పాల్గొన్నారు.



నాయకులతో కలిసి సభాస్థలాన్ని పరిశీలిస్తున్న నరసాపురం డీఎస్పీ

కష్టపడి చదివితే గుర్తింపు తథ్యం



మాట్లాడుతున్న ఏపీ నిట్ ఆచార్యుడు సందీప్

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 4 : కష్టపడి చదివిన విద్యార్థులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వుద్దంటి సందీప్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి సూచనల మేరకు ఏలూరు ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం తాడేపల్లిగూడెం లోని ఏపీ నిట్‌ను సందర్శించారు. ప్రాంగణంలోని ప్రయోగశాలలు, లైబ్రరీ, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలోనే విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో నవకల్పనకు బాటలు వేయాలన్నారు. కృత్రిమ మేదస్సు, రోబోటిక్స్ తదితర నూతన సాంకేతికతపై లోతైన అవగాహనను పెంచుకుని పట్టు సాధిస్తారో వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నిట్ ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, ఎస్ఆర్ఐ కళాశాల అధ్యాపకులు మురళీకృష్ణ, శైలు, మానస, రామాంజనేయులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్.. విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 4: ఆర్టీసీ స్పెషల్ రూట్లలో లక్కీడిప్ ఏర్పాటు చేసి వారికి బహుమతులు అందించడం ద్వారా ప్రయాణికులను ప్రోత్సహించడం అభినందనీయమని ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ అచంట, జంగారెడ్డిగూడెం, గణపవరం- భీమవరం రూట్లలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి గురువారం లక్కీడిప్ నిర్వహించారు. ఈ లక్కీడిప్‌లో జంగారెడ్డిగూడెం రూట్‌లో భువనేశ్వరి, బి.పవిత్ర, అచంట రూట్‌లో ఎ.సునీత, టి.సామ్రాజ్య, గణపవరం-భీమవరం రూట్‌లో కుసుమకుమారి, ఎస్.మణిమాలకు బహుమతులు లభించాయి.

9నుంచి సీపీఎం రాష్ట్ర సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరుటూటౌన్, జనవరి 4: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏలూరులో ఈనెల 9, 10, 11వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమావేశాల్లో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించడం వామపక్షాల ఐక్యతపై రాష్ట్ర సదస్సులో చర్చిస్తామన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారన్నారు. అంగన్వాడీ, మున్సిపల్ కార్మికు లు, ఇతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జగన్ విఫలమయ్యాడన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దాసోహమై రాష్ట్రానికి అన్యాయం చేస్తుందన్నారు. నూతన భూచట్టాన్ని తెచ్చి రైతులు, పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని, దాన్ని బలప రిచే వైసీపీలను చిత్తుగా ఓడించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 9వ తేదీన ఆర్ఆర్.పేట కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

» టి.నరసాపురం సొసైటీ డిపాజిట్‌దారుల ఆందోళన



సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న డిపాజిట్ దారులు

టి.నరసాపురం, జనవరి 4 : రుణాలు తీసుకుని తిరిగి కట్టని వారిపై తక్షణ చర్యలు తీసుకుని డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని టి.నరసాపురం సొసైటీ డిపాజిట్‌దారులు డిమాండ్ చేశారు. గురువారం సొసైటీ ఎదుట ఆందోళన చేపట్టారు. కొన్ని గంటలపాటు సొసైటీ ఆఫీసు తెరవకుండా పెట్రోల్ బంకు సాగకుండా నిలిపివేశారు. గ్రామానికి చెందిన అనుమోలు సీతారత్నంకు కోటి యాభై లక్షలు రావాలని, కన్నం శ్రీనుకు రూ.8 లక్షలు, పలివెల రాంబాబు రూ.6 లక్షలు, నాయుడు వెంకటేశ్వరరావుకు రూ.15 లక్షలు, మన్యం వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు, ఎస్‌కే ఈషా వలికి 2.50 లక్షలు, చిట్టిబొమ్మ శ్రీనుకు రూ.4.50 లక్షలు గడువు ముగిసిన ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టి బొమ్మశ్రీను మాట్లాడుతూ తన తల్లి హాస్పిటల్లో ఉందని వైద్యం చేయడానికి కూడా డబ్బులు లేవని వాపోయారు. పలివెల రాంబాబు మాట్లాడుతూ డిపాజిట్ చేసిన డబ్బులు రాకపోవడంతో తన కుమార్తె పెళ్లి కూడా ఆగిపోయిందన్నారు. ఈ విషయంలో సొసైటీ సిబ్బంది గానీ అధికారులు గానీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆందోళన విషయమై సొసైటీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి డిపాజిట్‌దారులను సముదాయించారు. అధికారులు మాత్రం దీనిపై స్పష్టమైన హామీ రైతులకు ఇవ్వలేదు. పదిమంది డిపాజిట్‌దారులు మాత్రమే బయటికి వచ్చారని కానీ వందలాదిమంది డిపాజిట్‌దారులు బయటకు రాలేక ఆవేదన చెందుతున్నారని వాపోయారు. ఈ విషయంపై కార్యదర్శి కటకం రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్టోబర్ నెలాఖరు నుంచి త్రీమెన్ కమిటీ సొసైటీకి రావడం లేదని, డిపాజిట్‌దారుల ఆందోళన విషయాన్ని ఉన్నతాధికారులకి తెలిపామని, ఏ నిర్ణయమైనా త్రీమెన్ కమిటీ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కుంతీదేవి ఉత్సవాల్లో దర్శకుడు వీవీ వినాయక్



కుంతీదేవి ఉత్సవాల్లో పాల్గొన్న వీవీ వినాయక్

పోలవరం, జనవరి 4 : గూటాల పంచాయతీ మహాలక్ష్మిదేవిపేటలో ప్రారంభమైన కుంతీదేవి ఉత్సవాల్లో దర్శకుడు వీవీ వినాయక్, ఎంపీ కోటగిరి శ్రీధర్ సోదరి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారిద్దరూ కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. వీవీ వినాయక్ మాట్లాడుతూ తనమీద ప్రాంతీయ అభిమానంతో ఆహ్వానించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఉపసర్పంచ్ కోరశిక శ్రీనివాస్, దేవిశెట్టి రమేశ్, అక్కాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చాట్రాయి తహసీల్దార్ మృతి



విశ్వనాథరావు (ఫైల్)

చాట్రాయి, జనవరి 4: చాట్రాయి మండల తహసీల్దార్ సీహెచ్ విశ్వనాథరావు (57) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ చాట్రాయి మండలంలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయమే నిద్ర లేచిన తరువాత గుండెలో నొప్పిగా ఉందని ఇంటి పనులు చూసే వ్యక్తితో చెప్పారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని సీపీఆర్ చేస్తూ విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య ఎన్టీఆర్ జిల్లాలో ట్రెజరీ శాఖలో జిల్లా అధికారిగా పనిచేస్తూ విజయవాడలో నివాసం ఉంటున్నారు. ఒక కుమార్తె విజయవాడలో వైద్యురాలిగా పని చేస్తుండగా మరో కుమార్తె అమెరికాలో చదువుకుంటోంది. ఆయన భౌతికాయాన్ని స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడు తరలించారు. అమెరికా నుంచి కుమార్తె వచ్చాక అంత్యక్రియలు జరుగుతాయని సన్నిహితులు తెలిపారు.

ఏలూరు జిల్లాలో ఎస్ఈబీ దాడులు

ఏలూరు క్రైం, జనవరి 4 : జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ తన సిబ్బందితో లింగపాలెం మండలం ముడిచర్లలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా, 1200 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకుని చింతలపూడి పోలీసులకు తదుపరి చర్యలు నిమిత్తం అప్పగించారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది కలిసి చాట్రాయి మండలం ముంకొల్లు గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,770 నగదు, ఐదు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకుని చాట్రాయి పోలీసులకు అప్పగించినట్టు ఎస్ఈబీ సీఐ తెలిపారు.



వీణ కచేరి చేస్తున్న యోగానందం, బృందం సభ్యులు

ఓలలాడించిన 'యోగానందం' వీణ కచేరి

భీమవరంటౌన్, జనవరి 4 : భీమవరం త్యాగరాజ భవనంలో జరుగుతున్న త్యాగరాజ 105వ ఆరాధనోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం త్యాగరాజ భవనంలో బెంగళూరుకు చెందిన వీణ విద్వాంసురాలు జె.యోగానందంచే వీణ కచేరి సంగీత ప్రియులను ఓలలాడించారు. తొలుత పంచరత్న కీర్తన జగదానందకారక కీర్తనతో వీణ కచేరి ప్రారంభించారు. సరస్వతి నమోస్తుతే కీర్తన సరస్వతీరాగం రూపతాళం, రఘు నాధనన్సుసుర రంజనిరాగం ఆదితాళం, వాణీ ద్వారా పలికించి ఆనందింపజేశారు. ప్రధాన కీర్తనగా నను పాలింపగా నడిచివచ్చితివా మోహనరాగంలతో శ్రోతలను ఆకట్టుకున్నాయి. వీణ కచేరికి సహవాయిద్యలుగా బెంగళూరుకు చెందిన రక్షిత రమేష్ మృదంగం లక్ష్మీరాజశేఖర్, కంజర భాగ్యలక్ష్మణకృష్ణ సహకరించారు. అనంతరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, కార్యదర్శి కారుమూరి ఆదిత్య, కారుమూరి చినబాబు, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి కళాకారులను సత్కరించారు.

తెలుగు మహాసభలకు శ్రీవారి ప్రచారరథం



ద్వారకాతిరుమల, జనవరి 5 : రాజమహేంద్రవరంలో జరిగే తెలుగు మహాసభలకు శ్రీవారి ధర్మప్రచార రథం గురువారం తెల్లవారుజామున తరలివెళ్లింది. అక్కడ గైట్ కళాశాలలో జరుగనున్న సభల నిమిత్తం ఈనెల 8 వరకు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈక్రమంలో ప్రచార రథ్నాన పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. ఆ తరువాత రథానికి అర్చకులు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి ప్రారం భించారు. ప్రచారరథాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాగనంపారు.

ఆరుగురి జూదరుల అరెస్ట్

ఉండి, జనవరి 4 : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశామని ఉండి పోలీసులు తెలిపారు. గురువారం ఉండి ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ మాట్లాడుతూ వాండ్రంలో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రు.4140 నగదు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే బాధ్యత పోలీసులదే : ఎస్పీ ప్రశాంతి



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 4 : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూసే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలీసు అధికారులతో గురువారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టారు పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులను నిర్వహిస్తూ సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. పోలీసు అధికారులకు కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆ ప్రదేశాల్లోని భౌగోళిక స్వరూపాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. సెక్టార్ పోలీసు అధికారులు తమకు నిర్ణయించిన పోలింగ్ బూత్‌లను పరిశీలన చేసి అక్కడ పోలింగ్ సక్రమంగా నిర్వహించడానికి కావాల్సిన వసతులు ఉన్నాయో లేదో గమనించి ఏమైనా లోపాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఏమైనా కేసులు నమోదైనా, అవినీతి కేసుల్లో ఉన్న ముద్దాయిలు, రౌడీషీటర్ల జీవన విధానాన్ని పరిశీలించి వారి నడవడికపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా తగిన సహాయ సహకారాలు, రక్షణ కల్పించాలని సూచించారు. వీసీలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ బోణం ఆదిప్రసాద్ పాల్గొన్నారు.


క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ళ, జనవరి 4 : ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వచ్చిన ఫిర్యాదుపై కాళ్ల పోలీస్‌స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరం పట్టణానికి చెందిన కె.శ్రీను(44) భీమవరంలోని చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉంటుంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్తిగా మద్యానికి బానిసైన అతడు డిసెంబరు 30న కాళ్ళ మండలం కాళ్ళ గ్రామంలోని తన తల్లి రమణమ్మ ఇంటి వద్దకు వచ్చి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన తల్లి బంధువులతో కలిసి భీమవరం ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరులో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై మృతుడి పెద్ద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాళ్ళ ఏఎస్ఐ వీవీఎస్ రామరాజు తెలిపారు.

రేషన్, ఎండీయూ వాహనాల్లో విజిలెన్స్ తనిఖీలు

» 4 రేషన్ షాపులు, 2 రేషన్ ఎండీయూ వాహనదారులపై కేసులు



రేషన్ వాహనంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

పాలకొల్లు టౌన్, జనవరి 4 :జిల్లా విజిలెన్స్ ఎస్పీ కరణం కుమారి ఆదేశాల మేరకు రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పాలకొల్లు పట్టణంలో రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను గురువారం తనిఖీ లు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 47, 42, 56, 58 నంబర్ల రేషన్ దుకాణా ల్లోనూ. రెండు ఎండీయూ వాహనాల్లోనూ తనిఖీలు నిర్వహించి సరుకులు వ్యత్యాసాన్ని గుర్తించారు. నలుగురు రేషన్ డీలర్లపైనా ఇద్దరు ఎండీయూ రేషన్ వాహనదారులపైనా కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్.రంజిత్‌కుమార్ విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏవో బి.సురేష్, సివిల్ సప్లయ్ తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.



పోలవరంలో కోతి కుక్క ఆలింగనం

శునకం-వానర స్నేహ బంధం

కుల, మత, జాతి, వర్గ వైషమ్యాలతో మానవులు నిత్యం సతమతమవుతున్న నేపథ్యంలో స్నేహమేరా జీవితం అంటూ గురువారం ఒక వానరం, శునకం స్నేహభావంతో ఆలింగనం చేసుకుని ఆడుకుంటున్న ఘటన కనిపించింది. పోలవరం పంచాయతీ బెస్తావీదిలో ఒక వీధి కుక్క.. చెట్లపై తిరుగుతూ వచ్చిన ఒక వానరం ఒక్కసారి స్నేహం చేసి చూడు ఎంత బావుంటుందో అన్నట్టు కనిపించాయి. - పోలవరం

నేల కూలిన వందేళ్ల మర్రిచెట్టు

పోలవరం గ్రామ శివారున తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టు గురువారం అగ్నికి ఆహుతై రోడ్డుపై కూలింది. ఆ సమయంలో రోడ్డుపై జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. నిత్యం ఆ రోడ్డుపై పునరావాస గ్రామాలకు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజానీకం రాకపోకలు సాగిస్తుంటారు. వందేళ్ల చరిత్ర గల ఊడల మర్రిచెట్టుకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మొదలు కాలి రోడ్డుపై కూలిపోయింది.



పోలవరంలో రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

బీసీలకు వెన్నుపోటు పొడిచిన జగన్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 4: బీజేపీ బీసీ సామాజిక చైతన్య బహిరంగ సభ 7న విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చ జోనల్ ఇన్‌చార్జ్ లక్కోజు అనీల్ ఆచార్య తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఆచార్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌ను 37 నుంచి 22శాతానికి తగ్గించి బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా వెన్నుపోటు పొడిచిందన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా బీసీలకు కేటాయించలేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను జగన్ తుంగలో తొక్కారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, సత్యనారాయణ, బాడిత నారాయణరావు, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపం గల వారికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ


ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేస్తున్న జేసీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 4: దివ్యాంగుల సంక్షేమంకోసం ప్రభుత్వం కృషిచేస్తుందని జేసీ బి.లావణ్యవేణి అన్నారు. దృష్టి లోపం గల వారికి ప్రత్యేక లిపి రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా గిరిజన భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దృష్టిలోపం ఉన్నవారికి ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ రాకాడ మణి, దివ్యాంగుల సంక్షేమ అసోసియేషన్ నాయకులు వీరభద్రరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పరివర్తన పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ టైటలింగ్ చట్టంలో ఏజెన్సీకి మినహాయింపు ఇవ్వాలి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, జనవరి 4: ప్రభుత్వం తెచ్చిన భూ టైటలింగ్ ల్యాండ్ చట్టంలో 5వ షెడ్యూల్డ్ ప్రాంతానికి మినహాయింపు ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కోరింది. అధ్యక్షుడు కొమరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజకు గురువారం వినతిపత్రం అందజేశారు. ముందుచూపు లేకుండా ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయడం ఆదివాసీలపై చిత్తశుద్ధి లేదని, రాజ్యాంగంపై అవగాహన లేదని తేటతెల్లమవుతుందన్నారు. ఆదివాసీ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేయాలని తెల్లం లక్ష్మణరావు కోరారు. త్వరలోనే కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు పీవో తెలిపారు. రవ్వ బసవరాజు, పొడియం కొవ్వాడయ్య, పూనెం వెంకటేశ్వరావు, నారం శంకర్, తెల్లం రవిప్రసాద్, సోడెం నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ పోలింగ్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 4: విద్యార్థులు ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని, ఓటు ప్రాధాన్యం ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, ఎంఈవో రాములు అన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, వెంకటాచార్యులు, బి.అశోక్, జీవి.లాల్, విద్యార్థులు పాల్గొన్నారు

ఫైలేరియా నిర్మూలనకు వైద్య సిబ్బంది చర్యలు


రక్తపూత నమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బుట్టాయగూడెం, జనవరి 4: ఫైలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి డీఎంవో జె.సురేష్‌కుమార్ తెలిపారు. అరుంధతిపేటలో ప్రజల నుంచి బుధవారం రాత్రి రక్తపూతలు సేకరించామన్నారు. గాఢ నిద్రలో ఉన్నపుడే ఫైలేరియా క్రిమి శరీరం నుంచి బయటకు వచ్చి రక్తంలో కలుస్తుందని అందుకే రాత్రి సమయాల్లో రక్తపూత నమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయన్నారు. దోమతెరలు ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు పెరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, సీహెచ్‌వో ఎం.కోటేశ్వరి, హెచ్‌ఎలు జెఎన్ బాలాజీ, ఎస్.బుజ్జి, ఎఎన్‌ఎం ఎస్.స్వప్న, ఆశాలు పి.పద్మ, పి.నాగమణి పాల్గొన్నారు.


కుక్కునూరులో జగన్ ఫొటోతో భిక్షాటన


పోలవరంలో విధులకు చేరాలనే ఉత్తర్వుల కాపీ దహనం


లింగపాలెం అంగన్‌వాడీల శిబిరంలో టీడీపీ నేతల నినాదాలు


పెదపాడులో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

నిరసన మంట

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

జిల్లాలో అంగన్వాడీల నిరసన మంటల్లో కలెక్టర్ ఉత్తర్వుల కాపీలు దహనమయ్యాయి. సమస్యలు పరిష్కరిస్తే విధుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని, యథావిధిగా విధులకు హజరవుతామన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా బెదిరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పలుచోట్ల మోకాళ్లపై నిలబడి, సీఎం ఫొటోతో భిక్షాటన చేసిన నిరసన వ్యక్తం చేశారు.


చింతలపూడిలో మానవహారంగా నిలబడిన అంగన్వాడీలు

పెదపాడు, జనవరి 4: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 24వ రోజుకు చేరుకోగా, గురువారం శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని నినాదాలు చేశారు. తిరుపతమ్మ, కె.శారద, సీతామహాలక్ష్మి, శ్రీకుమారి, దుర్గ, దేవమణి, వినీల, నాగలక్ష్మి, శివలీల తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: అంగన్‌వాడీల ఉద్యోగాలు తీసేస్తే సీఎం ఉద్యోగం తీసే సమయం దగ్గరలో ఉందన్నారు. 5వ తేదీ నుంచి విధులకు హాజరు కావాలని ప్రభుత్వం పంపిన సర్క్యులర్ కాపీలను తగులబెట్టినట్లు సీఐటీయూ నాయకులు గోపి, ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నిర్మలజ్యోతి, అనురాధ, అనంతలక్ష్మి, సూర్యకుమారి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: అంగన్‌వాడీలు విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామంటూ కలెక్టర్ ఇచ్చిన నోటీసు ప్రతులను రోడ్డుపై తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి పీఎల్‌ఎస్ కుమారి, చెరుకూరి మణి, హైమావతి, సీత, గుత్తుల విజయ, కుబ్రచ జుబేదా తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి మాతా శిశువులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు లేకుండా చూడాలని టీడీపీ నేత మంగిన కొండ డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు.

● బుట్టాయగూడెం: అంగనవాడీల సమ్మె కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నూర్జహాన్, కృపామణి, రామలక్ష్మి, రామయమ్మ, శ్రీదేవి, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు సరోజిని, మాణిక్యం మాట్లాడుతూ ఎన్ని బెదిరింపులు ఎదురైనా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. విధులకు హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటామని ఇచ్చిన ఉత్తర్వుల కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో కవిత, సరళ, అరుణ, హేమలత, పద్మ తదితరులు మాట్లాడారు.

● కుక్కునూరు: అంగన్వాడీ కార్యకర్తలు సీఎం జగన్ ఫొటోతో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నేత సాయికిరణ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు బెదిరింపుల సర్క్యులర్ ఇవ్వడం కాదని, సమస్యలు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ జారీ చేసిన సర్క్యులర్ కాపీ దహనం చేశారు. యర్రంశెట్టి నాగేంద్రరావు కుంజ నాగలక్ష్మి, బాడిస సుజాత, కణితి మంగ, వర్స మంగ, భవాని, కస్తూరి, రమాదేవి, మహాలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీల ఆందోళనకు టీడీపీ నాయకుడు సొంగా రోషన్‌కుమార్, పిల్లల శ్రీనివాస్ యాదవ్ మద్దతు తెలిపారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలకు తగిన న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన బెదిరింపు ఉత్తర్వుల కాపీని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు మాట్లాడుతూ 24 రోజుల సమ్మెలో ఒక్క అంగన్‌వాడీ సెంటర్ కూడా ప్రభుత్వం నిర్వహించకపోవడం సమ్మె జయప్రదమైనట్లు అన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వ తీరు దారుణమన్నారు. యూనియన్ నేతలు రాజామణి, స్వర్ణకుమారి, చల్లామణి, రత్నకుమారి పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అంగన్వాడీలు గురువారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఏలూరు, చింతలపూడిలో మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన


జంగారెడ్డిగూడెంలో కార్మికులకు టీడీపీ నేతల మద్దతు


ఏలూరులో న్యాయవాదుల రిలే దీక్ష

మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు టూటౌన్, జనవరి 4: నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, మున్సిపల్ కార్మికుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. గురువారం మోకాళ్లపై నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించపోతే రానున్న రోజుల్లో సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జగన్ ఇచ్చిన హామీలన్ని నెరవేర్చేవరకు సమ్మె ఆపే ప్రసక్తి లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మికుల సమ్మెకు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పలరాజు, శ్రీనివాసరావు, కన్నబాబు, సుబ్బారావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికుల సమ్మెతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడీపీ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, జనసేన కౌన్సిలర్ వలవల తాతాజీ డిమాండ్ చేశారు. సమ్మెకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో కార్మికులకు సంఘీభా వం తెలిపారు. పెనుమర్తి రామకుమార్, పరిమి సత్తిపండు, పగడం సౌభాగ్యవతి మాట్లాడారు. పరిమి సత్తిపండు మున్సిపల్ కార్మికులకు ఆర్థిక సాయం చేశారు.

● చింతలపూడి: మునిసిపల్ వర్కర్ల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఏఐటీయూసీ, కార్మిక సంఘాల జేఏసీ కలవడంతో నినాదాలతో పాత బస్టాండ్ ప్రాంతం హోరెత్తింది. మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుర్లపాటి బాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కృష్ణ, ప్రసాద్, నాగేశ్వరరావు బృందం సంఘీభావం తెలిపింది. నిరసనదీక్షలో మునిసిపల్ కార్మికులు వి.అనురాధ, వి.బాలు, పార్వతి, రాజేష్, వెలగాడి రాము తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

ఏలూరు కలెక్టరేట్: సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేస్తున్న సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. ఎస్‌ఎస్‌ఏ జేఏసీ నాయకులు భగవాన్ తదితరులు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పదవీవిరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీ పీఆర్‌టీయూ నాయకులు వెంకటేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు.

క్లాప్ ఆటోడ్రైవర్ల సమ్మె కొనసాగింపు

ఏలూరు టూటౌన్: ఏపీ క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలంటూ వెహికల్ డిపో వద్ద చేస్తున్న సమ్మె గురువారం కూడా కొనసాగింది. డ్రైవర్లకు ఐఎఫ్‌టీయూ, మున్సిపల్ డ్రైవర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ 10 సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మూల్యం చెల్లించక తప్పదన్నారు. సీఐటీయూ నాయకుల సోమయ్య జాన్‌బాబు, గోపి, కృష్ణారావు, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

చింతలపూడి: స్థానిక కోర్టు బయట చింతలపూడి బార్ న్యాయవాదుల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు చేయాలని కోరుతూ చేస్తున్న దీక్షల్లో కాకర్ల మాణిక్యాలరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగించారు. 2023 భూ హక్కు చట్టం వల్ల తక్కువ భూమి కలిగిన వారంతా నష్టపోతారన్నారు. ఈ చట్టంతో కలిగే నష్టాలు ప్రజలకు వివరించి, ప్రజల మద్దతుతో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, చట్టం రద్దు చేసే వరకూ తాము ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. మరోవైపు కోర్టు విధులను బహిష్కరించారు.

మహాజనుల పక్షాన ఎమ్మార్పీఎస్ పోరాటం

ఏలూరు టూటౌన్, జనవరి 4: మహాజనుల పక్షాన మహాజన సోషలిస్టు పార్టీ పోరాడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ దినోత్సవం కండ్రికగూడెం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ మహాజన సోషలిస్టు పార్టీని కుల సంఘంగా చూడకుండా సామాజిక వర్గాల పోరాట సంస్థగా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ, దివ్యాంగుల పించన్ పెంపుదల, వితంతువుల పింఛన్ పెంపుదల లాంటి ఎన్నో ఉద్యమాలను చేసి పార్టీ విజయం సాధించిందన్నారు. వారి సమస్యలపై పోరాటానికి ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు ఎన్.శేఖర్, నమ్మిన లక్ష్మీ, ఏ.మాధవరావు, నాగార్జున, విజయ, రమేష్, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేత బయ్యారపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4: టీచర్లు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లాశాఖ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌లను గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జీవోలు, నియమ నిబంధనలను డైరీలో పొందుపర్చడం బాగుందన్నారు. హక్కులతోపాటు బాధ్యతలు కూడా దృష్టిలో వుంచుకుని విధులు నిర్వర్తించాలని, అప్పుడే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు తమ సంఘం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించనుందని తెలిపారు. పేద విద్యార్థులను దత్తత తీసుకుని, ఇంటివద్ద ప్రైవేటు క్లాసులు చెప్పేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసరావు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4: సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మచిలీపట్నం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సత్యనారాయణ పశ్చిమగోదావరి డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ-2)గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు రెండు, మూడు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు, జనవరి 4: సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూలు ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 127 మంది పింఛన్లతోపాటు పెంచిన మూడు వేల రూపాయల ఫింఛన్లను పంపిణీ చేశారు. నాడు- నేడు కార్యక్రమంలో నిర్మించిన తరగతి భవనాన్ని, 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పాము సునీత మాన్సింగ్, ఎంపీపీ కనమల రామయ్య, జడ్పీటీసీ భవానీ రంగ, ఎం.జాన్సన్, నాగేశ్వరరావు, ఇంజేటి నీలిమ పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 7920 మంది పెన్షన్ దారులకు రూ. ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. తెల్లం రాజ్యలక్ష్మి, జడ్పటీసీ బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, వాసిరెడ్డి మధు, శ్రీనురాజు, సర్పంచ్ మోదుగు సునంద, ఎంపీటీసీ బొడ్డపాటి రాంబాబు, నార్లపాటి వెంకటేశ్వరరావు, బాలయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

కుక్కునూరు, జనవరి 4: మారేడుబాక, కివ్వాక పంచాయతీలో పలు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలని సంకల్పంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. వంకా కాంచనమాల, రాచమడుగు వరలక్ష్మి, తూము వెంకన్న, బాణాల వీరాచారి, రాచమడుగు నిరంజన్, బిట్ట అప్పారావు, కుంజ వెంకట నర్సయ్య, బాలకృష్ణ, గంగాధర రామకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ కోఆపరేటివ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు క్రైం, జనవరి 4 : పోలీస్ పెరేడ్ గ్రౌండ్ సమీపంలో పోలీస్ కోఆపరేటివ్ భవన నిర్మాణానికి ఏఎస్పీ ఎంజెవి భాస్కరరావు గురువారం భూమి పూజ నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బోణం ఆది ప్రసాద్, ఎఆర్‌డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఆర్‌ఐ పవన్‌కుమార్, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


తాళ్లగోకవరంలో టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న చింతమనేని


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి


భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాగంటి బాబు

చరమాంకంలో జగన్ సర్కార్

భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నేతలు

పెదవేగి, జనవరి 4: ప్రజలను అష్టకష్టాలకు గురిచేస్తున్న జగన్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తాళ్లగోకవరంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆరు పథకాల మినీ మేనిఫెస్టోను చింతమనేని అందజేశారు. జగన్ పాలనలో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారన్నారు. అంధకారంలో వున్న రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితు వెలుగు వస్తుందన్నారు. నెక్కలపూడి రామచంద్రరావు, సర్పంచ్ నెక్కలపూడి సురేష్‌బాబు, బొప్పన సుభాకర్, కొనకళ్ళ శివమణి, తాతా సత్యనారాయణ, మాదు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న జగన్ ముఖ్యమంత్రి స్థానానికి అనర్హుడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 44వ డివిజన్‌లో ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో వివరించి టీడీపీని గెలిపించాలని చంటి కోరారు. ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నర ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఎలా దోచుకుంటుందో వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జి మల్లెపు రాము, డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, వెంకన్న, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గం కానుకొల్లులో మాజీ ఎంపీ మాగంటి బాబు భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. త్రినాథరాజు, వెంకటేశ్వరరాజు, ఎ.రాంబాబు, నాగాంజనేయులు, వెంకన్నబాబు, స్వామి, నందకిషోర్, కృష్ణారావు, జోసఫ్ తంబి, పి.బాబురావు పాల్గొన్నారు.

● భీమడోలు: జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది జగన్‌రెడ్డిలో అధికారం కోల్పోతామనే భయం పట్టుకుందన్నారు. ఒక్క ఛాన్స్ అయిపోయిందని, జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం పార్టీయేనని గన్ని పేర్కొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

ఏలూరు రూరల్, జనవరి 4: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి పూజిత అక్షింతలను గురువారం శనివారపుపేట పోస్టాఫీస్ వీధిలో ఇంటింటికి అందజేశారు. అయోధ్యలో పూజల సందర్భంగా అక్షింతలను తలపై వేసుకోవాలన్నారు.

● లింగపాలెం: ముడిచర్లలో వీహెచ్‌పీ కార్యకర్తలు, గ్రామస్థులు అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో జరగబోయే ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరసా కిషోర్, ముడిచర్ల సర్పంచ్ రావి రమాదేవి, అభయాంజనేయస్వామి ఆలయ భజనమండలి మహిళా ప్రముఖ్ పాతూరి జయలక్ష్మి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అనఘాష్టమి వ్రతాలు

జీలుగుమిల్లి, జనవరి 4: కామయ్యపాలెంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలు దత్తాశ్రమ నిర్వాహకులు అనఘానందస్వామి గురువారం నిర్వహించారు. 200 కలశాలతో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ దంపతులు, మహిళలు పాల్గొన్నారు. మార్గశిర మాసంలో అనఘాష్టమి ప్రత్యేక తిథిని పురస్కరించుకుని వ్రతాలు నిర్వహించారు. సమీప గ్రామాల మహిళలు కూడా పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమంలో దత్తాత్రేయుని రథోత్సవం, అన్నసమారాధనలు జరిపారు. టిఎస్.రవికుమార్, చిర్రి బాలరాజు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఏలూరు ఎంఈవో కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. సంఘ నాయకులు గురువారం పత్రికలకు విడుదల చేశారు. జిల్లాలో పది మంది టీచర్లను ఎంపిక చేశామని, డీఈవో శ్యాంసుందర్ సత్కరించారన్నారు. గులిపల్లి నాగమణి, సుదర్శనం మేరీ సునీత, సొంగా ఝాన్సీ రాణి, గంటా నాగభూషణ మణి, నల్లమోతు మీనాక్షి, నక్కా సరళకుమారి, కర్రే కుమారి, కారుమూరి వెంకటలక్ష్మి, ఎండి. అక్బరున్నీసావలి, ఎండి.కరీమాబేగంను సత్కరించారు. సమగ్రశిక్ష ఇన్‌చార్జి సీఎంవో రవీంద్ర, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.మనోజ్‌కుమార్, పి.సాల్మన్, ధర్మలింగం, జి.వెంకటరమణ, బి.కృపాకరణ్, వి.ధనకాంత, శ్రీనివాస్, జి.రామదాసు, జి.జె.తంబి, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లల ఆరోగ్యం, పోషణపై దృష్టి సారించాలి

పెదపాడు, జనవరి 4: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం కొన్ని పరిష్కరించిందని, మిగతా వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ పీడీ పద్మావతి అన్నారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లోని దీక్షా శిబిరాన్ని పెదపాడు ప్రాజెక్టు అధికారి కె.విజయలక్ష్మి, అదనపు సీడీపీవో సునీల్ రాజశేఖర్‌లతో కలిసి గురువారం సందర్శించారు. గర్భిణులు, పిల్లల ఆరోగ్యం, పోషణ ప్రయోజనాల దృష్ట్యా సమ్మె విరమించాలని, 5వ తేదీలోగా విధులకు హాజరు కావాలని పద్మావతి అంగన్‌వాడీ కార్యకర్తలను అభ్యర్థించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** జిల్లా పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌ను శుక్రవారం ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రారంభించనున్నారు. డిస్ట్రిక్ట్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2024లో విజేతలు రేంజ్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారు.
- **పెదపాడు :** సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ నూతన పోకడలు - ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై ప్రతీక్ భరత్ పటేల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ మల్లికార్జునుడు, కొండ్రెడ్డి వెంకటేశ్వరరావు, కొడాలి శ్రీధర్, కో-ఆర్డినేటర్స్ మండ సుష్మ, కమ్మ ఆశ ప్రవంతిలు పాల్గొన్నారు.
- వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు అధునాతన కార్డియో వాస్కులర్ లైఫ్ సపోర్ట్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.ఫణీంద్ర గుండె నొప్పికి కారణాలు, సీపీఆర్ చేసే విధానం వివరించారు. చలసాని విశ్వనాథం, శైలజ పాల్గొన్నారు.
- టీడీపీ పెదపాడు మండల అధ్యక్షులు లావేటి శ్రీనివాసరావు తల్లి లావేటి భారతమ్మ గురువారం మృతి చెందారు. మాజీ ఎంపీ మాగంటి బాబు భారతమ్మ మృతికి సంతాపం తెలిపారు. మాగంటి మిల్లుబాబు, బొప్పన సుధ, గారపాటి రామసీత, మోరు శ్రావణి సానుభూతి తెలిపారు.
- **ఉంగుటూరు :** జాతీయ రహదారిపై కైకరం-అక్కుపల్లిగోకవరం రహదారి సమీపంలో స్కూటీకి కుక్క అడ్డు రావడంతో ఏలూరుకు చెందిన కుప్పల రవితేజ, అతడి తల్లి లక్ష్మి గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నారాయణపురం సెంటర్ ప్రమాదంలో ఆకుల రాంప్రసాద్ గాయపడ్డారు.
- ఉంగుటూరు మండలం కాగుపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా డే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మానస అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ అధికారి వైవీ.లక్ష్మణరావు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కలెక్టర్ సర్క్యులర్ దహనం

» 24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె


కలిదిండిలో సర్క్యులర్ కాపీని దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కలిదిండి, జనవరి 4 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ 24 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు గురువారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ జారీ చేసిన సర్క్యులర్ కాపీలను దహనం చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అబిదాబేగం, రమాదేవి, మేనక లక్ష్మి, విజయ కుమారి, లావణ్య, జ్యోతి, భారతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో మౌనదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

మౌన దీక్ష

● ముదినేపల్లి: స్థానిక మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరవధిక నిరసన దీక్షా శిబిరం వద్ద గురువారం అంగన్‌వాడీలు మౌనదీక్ష పాటించారు. సూరపనేని అరుణ కుమారి, సొంగా మణి, బండి పద్మ నాయకత్వం వహించారు. తొలుత సంఘ నేత అరుణ కుమారి మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోకపోవటం దారుణన్నారు.


ముసునూరులో గంగిరెద్దుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

గంగిరెద్దుకు వినతి

● ముసునూరు: దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి డిమాండ్ చేశారు. విద్యావతి, శ్యామల, దుర్గ, మేరిసులోచన, కృపమ్మ, జామయమ్మ తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో సర్క్యులర్ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

బెదిరింపులకు భయపడం..

● కైకలూరు: అంగన్వాడీలను బెదిరించి ఆందోళనను విరమింపజేయాలని చూస్తే సహించేది లేదని యూనియన్ అధ్యక్షురాలు పి.సుజాత హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ ప్రతులను గురువారం శిబిరం వద్ద దహనం చేశారు. ఈ నెల ఐదోతేదీలోపు విధులకు హాజరవ్వాలని లేకపోతే తొలగిస్తామన్న అధికారులు బెదిరింపులకు భయపడమని అన్నారు. విజిత, మీనాకుమారి, ఝాన్సీ, ఉషా, రమణ, తదితరులు పాల్గొన్నారు.


మండవల్లిలో..

ఎన్ని డెడ్‌లైన్లు పెట్టినా..

● మండవల్లి: ప్రభుత్వం ఎన్ని డెడ్‌లైన్లు పెట్టినా సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ వెల్లడించింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలో ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదేశ పత్రాలను దహనం చేశారు. చెల్లమ్మ, విజయలక్ష్మీ, వాణి పాల్గొన్నారు.


నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

● నూజివీడు: సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనదీక్ష గురువారం 24వ రోజుకు చేరింది. యూనియన్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ, కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అధ్యక్షకార్యదర్శులు ఎస్.ఆర్ హనుమాన్లు, జి.రాజు, పద్మ, జ్యోతి, విజయలక్ష్మి, మణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

» కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసనలు

నూజివీడు టౌన్, జనవరి 4: మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్ది రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ, పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయాలని, పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కరోనావిపత్తులో పనిచేసి మరణించిన కార్మికులకు ప్రకటించిన రూ.50 లక్షలు తక్షణం విడుదల చేయాలన్నారు. డి.రవి, ఎం.విజయ, ఎస్.శ్యామల, రజినీ, ఉషారాణి, రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


ఆందోళన చేస్తున్న కార్మికులు

ముసునూరు, జనవరి 4: మిడ్డే మీల్స్ ఏజన్సీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. వేల్పుచర్ల ఎంపీపీ పాఠశాల వద్ద గురువారం కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. బక్కయ్య మాట్లాడుతూ, గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 2003 నుంచి పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, నైట్‌వాచ్‌మెన్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల అన్నారు. భవాని, మాలతి, కాలి మంగమ్మ పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

నూజివీడు టౌన్, జనవరి 4: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ కోర్టుహాల్ వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం కొనసాగాయి. ప్రజల ఆస్తుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న భూహక్కుచట్టాన్ని రద్దుచేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. చీకటి చట్టాల వల్ల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు.

ఆధునిక సేద్యం!


బొప్పాయి తోట

» శాస్త్రవేత్తల సూచనలతో సాగు
» డ్రిప్ సిస్టమ్ ద్వారా మొక్కకు స్వచ్ఛమైన నీరు, ఎరువులు
» తక్కువ పెట్టుబడితో లాభాలు


తోట మధ్యలో నిర్మించిన నీటి కుంట

చాట్రాయి, జనవరి 4: కాలంతో పాటు వివిధ రకాల పంటల సాగులో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ, ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యయంసాయం చేస్తున్నారు కొందరు రైతన్నలు. స్వచ్ఛమైన నీటిని, ఎరువులను డ్రిప్ సిస్టమ్ ద్వారా అందిస్తూ వృధాను నివారిస్తు నవీన సేద్యం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు ఔత్సాహిక రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్నారు. వాణిజ్య పంటలు సాగుచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇదేకోవలో చాట్రాయికి చెందిన ఔత్సాహిక రైతు మందపాటి బసవారెడ్డి ఆధునిక పద్ధతిలో బొప్పాయి సాగు చేపట్టి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. సాగు భూమికి మధ్యలో పెద్ద నీటి కుంటను నిర్మించి, అందులో నీరు ఇంకకుండా ప్లాస్టిక్ షీటు పరిచారు. కరెంట్ రాగానే ఆటోస్టార్టర్ సాయంతో మోటారు ఆన్ అయి కుంటలోకి నీరు చేరుతుంది. బోరు నుంచి వచ్చిన నీటిలో మలినాలు కిందకు వెళ్లి స్వచ్ఛంగా తయారైన తర్వాత కుంటలో ప్రత్యేకమైన పద్ధతిలో అమర్చిన మోటారు ఆన్ చేయగానే నీటిని ఫిల్టర్ చేస్తూ డ్రిప్‌సిస్టం ద్వారా మొక్కలకు అందుతుంది. ఎరువులు కూడా ఈ విధానం ద్వారానే అందిస్తున్నారు. స్వచ్ఛమైన నీరు పైరుకు అంది మొక్కలు ఏపుగా పెరుగుతాయని, చీడపీడల బెడద తగ్గుతుందని, కూలీలు, ఎరువులు, పురుగు మందులు తదితర ఖర్చులు తగ్గి రైతులకు లాభాలు వస్తాయని ఔత్సాహిక రైతు బసవారెడ్డి చెప్పారు.

నలుగురి పని ఒక్కరే..

» ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో ప్రతిష్టంభన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో-2

ముదినేపల్లి, జనవరి 4 : సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె వల్ల విద్యాశాఖ కార్యకలాపాలు బంద్ అయ్యాయి. పాఠశాలల నిర్వహణలో ప్రతిష్టంభన నెలకొంది. మండలంలో 16 మంది సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగు లు 16 రోజులుగా సమ్మె చేస్తుండటం తో బిల్లులు రూపొందించి ఆన్‌లైన్ చేసేపనులు నిలిచిపోయాయి. వాచ్‌మెన్ లు, ఆయాలు, భోజన ఏజెన్సీ బిల్లులు, టీచర్ల ఇంక్రిమెంట్లు తదితర అంశాలకు సంబంధించిన బిల్లులను తయారు చేసి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ప్రతీ నెలా 15లోగా బిల్లులు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, ఎంఈవో-2 నరేష్ కుమార్ కొన్ని బిల్లులు మాత్రమే ఆన్‌లైన్ చేయగలిగారు. దీంతో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. నలుగురు చేసే 76 పాఠశాలల బిల్లులను ఒక్కరే తయారు చేసి ఆన్‌లైన్ చేయటం భారమైంది.


మర్లపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న డీవైఈవో

క్రీడల్లో యువత నైపుణ్యం సాధించాలి

చాట్రాయి, జనవరి 4: ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకొని యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని నూజివీడు డీవైఈవో సేవ్యా నాయక్, ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ ఇన్‌చార్జి రవీంద్ర అన్నారు. మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. మర్లపాలెం, చిత్తపూరు, చనుబండ, చిన్నంపేట హైస్కూల్స్‌లో జరిగిన పోటీల్లో 536 మంది క్రీడాకారులు పాల్గొనగా 25 మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. హెచ్‌ఎంలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకాగ్రత, పట్టుదలతో చదవాలి

ముసునూరు, జనవరి 4: విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదవి మంచి గ్రేడ్ సాధించాలని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవ్యనాయక్ అన్నారు. రమణక్కపేట జడ్పీపాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు.పాఠశాల రికార్డులు, మిడ్డేమిల్స్ నాణ్యతను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలను సంధించి, సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు అందించే సులభతరమైన బోధనలను శ్రద్ధగావినాలన్నారు. అనంతరం చెకుముకి సైన్స్ టాలెంట్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం రామకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతం


వ్రతంలో పాల్గొన్న భక్తులు

మండవల్లి, జనవరి 4: లోకుమూడి దత్తాశ్రమంలో అనఘాష్టమి వ్రతాన్ని గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ట్రస్టీ అధ్యక్షులు గురజాడ ఉదయ శంకర్ పర్యవేక్షణలో జరిగిన పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

380 మందికి కంటి పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ముసునూరు, జనవరి 4: అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణక్క పేటలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరాన్ని గ్రామప్రముఖులు గోళ్ళ ఆంజనేయులు ప్రారంభించారు. నూజివీడు అమెరికన్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ దత్తం, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జెమ్మద్ షాహీన్ సూమారు 380మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 176 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 46 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. ట్రస్ట్ చెర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఆంజనేయులు, విఘ్నేశ్వరరావు, వాసు, సత్యనారాయణ, లక్కపాము కాంతారావు, పాశం నాగబాబు పాల్గొన్నారు.

హీల్ క్యాంపస్‌లో ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ఆగిరిపల్లి, జనవరి 4: మండలంలోని తోటపల్లి హీల్ స్కూల్ ఆవరణలో అంధుల బంధువు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణేంద్ర తుండూరి ఇన్‌స్టిట్యూట్ విజువల్లీ ఛాలెంజెడ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుకవాసి రష్మంత్ మాట్లాడుతూ స్పర్శతో అక్షరాలను గుర్తించే విధానాన్ని కనిపెట్టి అంధులు సకల విద్యలను అభ్యసించు టకు దారిచూపిన గొప్ప వ్యక్తి లూయిస్‌బ్రెయిలీ అన్నారు. హీల్ ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ, అంధుల పాఠశాలలో 33 మంది వివిధ కోర్సులు నేర్చుకుంటున్నారన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన అంధ విద్యార్థినీ విద్యార్థులను హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జ్ కె.అబ్రహం అభినందించారు.

టీచర్లు అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 4: టీచర్లు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లాశాఖ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌లను గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జీవోలు, నియమ నిబంధనలను డైరీలో పొందుపర్చడం బాగుందన్నారు. హక్కులతోపాటు బాధ్యతలు కూడా దృష్టి లో వుంచుకుని విధులు నిర్వర్తించాలని, అప్పుడే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. పేద విద్యార్థులను దత్తత తీసుకుని ప్రైవేటు క్లాసులు చెప్పేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించామన్నారు.

మహాజనుల పక్షాన ఎమ్మార్పీఎస్ పోరాటం

ఏలూరు టూటౌన్, జనవరి 4: మహాజనుల పక్షాన మహాజన సోషలిస్టు పార్టీ పోరాడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ దినోత్సవం కంద్రికగూడెం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ మహాజన సోషలిస్టు పార్టీని కుల సంఘంగా చూడకుండా సామాజికవర్గాల పోరాట సంస్థగా చూడాలన్నారు. ఎన్.శేఖర్, లక్ష్మి, ఏ.మాధవరావు, నాగార్జున, విజయ పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలతోనే పేదల అభ్యున్నతి'


సభలో మాట్లాడుతున్న ఇసాక్

ముసునూరు, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అముదాల ఇసాక్ అన్నారు. చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. మండల అధ్యక్షులు అనగాని రాంబాబు మాట్లాడుతూ, మోదీ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. మహిళా మోర్చ మండల అధ్యక్షురాలు రామలక్ష్మి విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్‌లపై అవగహన కల్పించి, దరఖాస్తులను స్వీకరించారు. కండేపు రామగిరి, పుట్ల మోహన్‌రావు, కంచర్ల రాంబాబు, ఎంపీడీవో జి.రాణి, ఏవో ఎస్.మధుమోహన్ పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించి విద్యలో రాణించాలి


అవగాహన కల్పిస్తున్న విజయకుమార్

కైకలూరు, జనవరి 4: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. ఆలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం కెరియర్ గైడెన్స్‌పై మానవతా సేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ సాధన చేస్తే గుర్తుంటాయన్నారు. సులభ తరమైన మార్గాన్ని ఎంచుకుని విద్యనభ్యసించి మంచి ఫలితాలు సాధించాల న్నారు. హెచ్‌ఎంలు చప్పిడి సారధి, జి. త్రినాద్, తలారీ వేణుగోపాలకృష్ణ, శ్యాంకుమార్, విమ్మడి విఠల్, చింతపల్లి జయప్రకాష్, కొల్లేటికోట విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం అభియోగాలపై రెండో రోజు విచారణ

ముదినేపల్లి, జనవరి 4: మండలంలోని పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం, పరిపాలనాపరమైన అంశాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న అభియోగాలపై రెండో రోజైన గురువారం విచారణ కొనసాగింది. 2018 నుంచి అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ జరిపించాలని గ్రామస్థులు వల్లూరిపల్లి రామకృష్ణారావు, రెడ్డి వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్ మేరకు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం డీపీవో నియమించిన విచారణ కమిటీ బుధవారం విచారణ ప్రారంభించింది. డీఎల్‌పీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పిటిషన్‌లో పేర్కొన్న 23 అంశాలపై పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. నీటి కుళాయిల మంజూరు, అందుకు లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము తదితర అంశాలకు సంబంధించి బహిరంగ విచారణ నిర్వహించారు. అదనంగా కంట్రిబ్యూషన్ చెల్లించామని లబ్ధిదారులు అధికారులకు అలేఖ్య విల్లాస్, అప్పారావుపేటలో తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఈ నెల 6న హైకోర్టుకు నివేదికను సమర్పించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

మామిడి సస్యరక్షణ చర్యలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న జ్యోతిప్రియాంక

ముసునూరు, జనవరి 4: మామిడిలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానవన అధికారిణి కె.జ్యోతి ప్రియాంక అన్నారు. కొర్లకుంట, తాళ్లవల్లి గ్రామాల్లోని మామిడి తోటలను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జనవరిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఆమె రైతులకు అవగహన కల్పించారు. బోరాన్ లోపం ఉన్న తోటల్లో పూత బాగా వచ్చినా ఫలదీకరణ సరిగ్గా జరగకపోవడం వలన పిందెకట్టు సరిగా ఉండదన్నారు. బోరాన్ లోపాన్ని సవరించి పిందెకట్టు పెంచడానికి పూమొగ్గలు బయటకు రాకముందే బోరాక్స్ పౌడర్‌ను రెండు గ్రాములు ఒకలీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. బూడిద తెగులు నివారణ నీటిలో కరిగే గంధకము మూడు గ్రాములు లేదా హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్ల మందును ఒకలీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని వివరించారు. నక్కన బోయిన సత్యనారాయణ, మూల్పూరి నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు

ముదినేపల్లి, జనవరి 4: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడిపందేలు, జూదాల నిర్వహణ, మద్యం విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ కె.శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం 144 సెక్షన్ అమలులోకి వచ్చిందదని, ఈ నెల 18 వరకు అమలులో ఉంటుందని చెప్పారు. జూదాల నిర్వహణకు స్థలాలు ఇచ్చే యజమానులు, పాల్గొనేవారిపై కూడా చర్యలుంటాయన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

ముసునూరు, జనవరి 4: పాత గొడవలు పురస్కరించుకుని ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలివి. మండలంలోని చింతలవల్లి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు గత నెల 31వతేదీ రాత్రి గ్రంథాలయం వద్ద న్యూయర్ వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు. డీజే సౌండ్‌బాక్స్‌లను పోలీసులు తొలింగించారు. అక్కడే ఉన్న సొంగా రవిపై పాతగొడవలను దృష్టిలో పెట్టుకుని పల్లిపాము రంగరావు, కృపారావు, వంశీ దాడిచేశారు. గాయపడిన రవి నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

పోలీసుల అదుపులో 20 మంది జూదరులు

ముదినేపల్లి, జనవరి 4 : పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలపై పోలీసులు ముమ్మరదాడులు నిర్వహించటం ప్రారంభించారు. సంక్రాంతి సీజన్ వస్తున్నందున పలుచోట్ల పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకుంటున్న పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకుంటున్నారు. గురువారం బొమ్మినంపాడు, కొరగుంటపాలెం, పెదకామనపూడి గ్రామాల పరిధిలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడులు జరిపి 20 మంది జూదరులను అదుపులోకి తీసుకుని సుమారు రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న బాబు

జగన్ పాలనలో అభివృద్ధి నిల్

మాజీ ఎంపీ మాగంటి బాబు

మండవల్లి, జనవరి 4: టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమౌతుందని, జగన్ పాలనతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) పేర్కొన్నారు. పెరికేగూడెంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వైసీపీ ప్రభుత్వంతో జరుగుతున్ననష్టాలు, కుంటుపడుతున్న అభివృద్ధి ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయేది టీడీపీప్రభుత్వమేనని వెల్లడించారు. పెన్మెత్స వెంకటేశ్వరరాజు, త్రినాధరాజు, ముళ్లపూడి సత్తిబాబు, ఎలికే రాంబాబు, నాగాంజనేయులు, వెంకన్నబాబు, స్వామి, నందకిషోర్, కృష్ణారావు, జోసఫ్ తంబి పాల్గొన్నారు. అనంతరం కానుకొల్లులో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

'రాష్ట్ర చరిత్రలో వైసీపీ విఫల ప్రభుత్వం'

● ఆగిరిపల్లి : రాష్ట్ర చరిత్రలో విఫల ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. అమ్మవారిగూడెంలో గురు వారం జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ సభలో మాట్లాడుతూ, పరిపాలన చేతకాకపోతే సలహాలు తీసుకుని మెరుగైనపాలన అందించటం చూశాం.. సలహాదారులను పెంచుకుంటున్నా పనితీరులో మార్పురాలేదని అన్నారు. దద్దమ్మ ముఖ్యమంత్రి చేతకాని చేష్టలతో రాష్ట్రం భ్రష్టుపడుతుందని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఇచ్చామని, ఇప్పుడు కార్పొరేషన్ డైరెక్టర్లు తాము ఏం చేశామో చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. నూజివీడు ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేస్తే స్థానిక నాయకత్వం ఎంపిక చేయలేదని.. తనకు పోటీగా ఎస్సీలు ఎదుగుతారని ఇక్కడి ఎమ్మెల్యేకు భయంగా ఉందని విమర్శించారు. జలసూత్రం కొండలరావు, రాణిమేకల రాంబాబు, అప్పికట్ల నాగేశ్వర రావు, మహాలక్ష్మయ్య, గోళ్ళరాజు, రాజశేఖర్, దావీదు పాల్గొన్నారు.

ఎస్సీలను విస్మరించిన వైసీపీ


కరపత్రాలు అందజేస్తున్న నేతలు

● కలిదిండి : వైసీపీ ప్రభుత్వం ఎస్సీలను విస్మరించిందని టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్ల రాజు విమర్శించారు. మట్టగుంటలో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివ రించారు. ఎస్సీలను ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటున్నారన్నారు. కోకా తాతయ్య, మోకా రాంబాబు, దున్న సత్యనారాయణ పాల్గొన్నారు.

'జయహో బీసీ' సదస్సుకు తరలిన బీసీ నాయకులు


సదస్సుకు బయలుదేరిన నాయకులు

కలిదిండి, జనవరి 4 : గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు కలిదిండి నుంచి ఆ పార్టీ బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, వారి రక్షణకు ప్రత్యేకచట్టం తీసుకు రావటమే చంద్రబాబు లక్ష్యమన్నారు. రెడ్డి చక్రవర్తి, ప్రోటు శ్రీనివాస రావు, తిరుమలశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.


చాట్రాయి నుంచి..

● చాట్రాయి: మంగళగిరిలో జయహో బీసీ సదస్సుకు మండలం నుంచి తెలుగుదేశం నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, నాగార్జున, రాయవరపు పుల్లారావు, సీతారాములు, చీకటి చెన్నారావు, చంద్రకళ, ధనలక్ష్మి, కందుల కృష్ణ, పానుగళ్ళ కోటేశ్వరరావు, ఈడా శ్రీనివాసరావు హాజరయ్యారు.

కొల్లేరు ప్రజలకు టీడీపీ అండ


పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఏసురాజు

కైకలూరు, జనవరి 4: టీడీపీ అధికారంలోకి వచ్చాక కొల్లేరు ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు తెలిపినట్లువడ్డీసాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. విజయవాడలో గురువారం అచ్చెన్నాయుడును కొల్లేరు ప్రజలు కలిశారు. తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కొల్లేరు ప్రజలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రజల సమస్యలపై స్పందించి కృషి చేయాలని తనకు సూచించినట్లు పేర్కొన్నారు. జయమంగళ సుబ్బరాజు, సైదు ఏడుకొండలు, ముంగర ఏసురాజు, సాధికారిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

భువనేశ్వరి యాత్ర విజయవంతం కావాలని..


విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్తున్న టీడీపీ నేతలు

ముదినేపల్లి, జనవరి 4 : చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆయన సతీమణి భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర విజయవంతం కావాలని ఆశిస్తూ గురువారం మండలంలోని అల్లూరు గ్రామం నుంచి టీడీపీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, పత్తి శివ, పంతగాని నాగ శ్రీనివాస్ విజయవాడకు పాదయాత్రగా తరలివెళ్లారు. శుక్రవారం అమ్మను దర్శించుకుని పూజలు చేయనున్నట్టు చెప్పారు. టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

154 మందికి నూతన పింఛన్ల పంపిణీ

కైకలూరు, జనవరి 4: ఇచ్చిన మాటప్రకారం పెన్షన్లను రూ.మూడు వేల వరకు పెంచిన ఘనత జగన్‌దేనని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. 154 మందికి నూతన పెన్షన్లు అందజేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఎండీ జహీర్, డి.ఎం. నవరత్నకుమారి, మంగినేని రామకృష్ణ, పంజా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నెక్కలంగొల్లగూడెంలో జగనన్న సురక్ష

ఆగిరిపల్లి, జనవరి 4: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నెక్కలంగొల్లగూడెంలో నిర్వహిస్తున్నట్లు ఎండీవో శంకర్‌రావు గురువారం తెలిపారు. అన్నిరకాల అనారోగ్య సమస్యలకు స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. జగనన్న సురక్ష ప్రతి నెల ఐదు, 19వ తేదీల్లో మాత్రమే జరుగుతుందని చెప్పారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందజేత

ముదినేపల్లి రూరల్, జనవరి 4: మండలంలోని చిన్న కామనపూడికి చెందిన వంశీకృష్ణకు మూడునెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య చికిత్సకు అవసరమైన కొద్ది మొత్తంలో ఆర్థిక సహాయాన్ని గ్రామస్థుల సహకారంతో గురువారం అతడి కుటుంబసభ్యులకు అందజేశారు. బత్రాజు శివాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.